# నలుగురితోపాటు..

పెళ్ళి చేసి చూడు అన్నారు కానీ, పెళ్ళికి వెళ్ళడమూ అంత అషామాషీ వ్యవహారమేమీ కాదు. అందుకు మన ఆనందరావే ఓ చక్కని ఉదాహరణ

ఆయాసపడుతూ లోపలికి వచ్చాడు ఆనందరావు. "కాసిని చల్లటి మంచినీళ్ళు పట్రా!"

"ఇదిగో. తీసుకోండి. ఇవ్వాళ ఎండ మరీ ఎక్కువగా ఉంది. కచ్చితంగా ఏ నలభైమూడో ఉంటుంది. చెప్పడం మరిచాను- శ్రీనివాసరావుగారు, భార్యా వచ్చారు."

"ఏమిటి విశేషం?"

"వాళ్ళమ్మాయి పెళ్ళిట."

పొరబోయింది ఆనందరావుకి. "ఎప్పుడు?" వచ్చేనెల్లో ఏమో అని చిన్న ఆశ.

"రేపు ఇరవై నాలుగున, ఆదివారం."

"హతోస్మి!... ఎక్కడ?" దగ్గర్లో ఏమో అని మరో ఆశ.

"వాళ్ళింటిదగ్గరే."

"చచ్చాం. అయితే, ఊరిబయటే అన్నమాట." నీరసం వచ్చేసింది.

"ఇది మరీ బాగుంది. ఇంటిదగ్గరైతే వాళ్ళకి సులువు కదూ!"

"అవుననుకో. కానీ, మనకు ఆటోలకి తడిసి మోపెడవుతుంది."

"ఏం చేస్తాం మరి? బస్సులు దొరికీ దొరకకా! ఒకవేళ దొరికినా ఆ రష్‌లో గొలుసు కాస్తా ఏ దొంగవెధవో నైవేద్యం పెట్టేశాడంటే తిక్క వదిలిపోతుంది."

"పోనీ గొలుసు వేసుకోకపోతే ఏం?" ఆనందరావు నిజమైన ఆశాజీవి.

"ఇంకా నయం. పెళ్ళికెళ్తూ బోసి మెడతో ఎలా వెళ్తాను? వంకీలూ, వడ్డాణాలకి ఎలాగూ కాలం చెల్లిపోయింది. ఇక గొలుసైనా లేకుండా ఎట్లా?"

"ఇంతకీ పెళ్ళికూతురికి ఏం ఇవ్వాలి?" మాట మార్చాడు.

"మీరే చెప్పండి."

"చీర కొనిద్దామా?"

"చీర అంటే మాటలా. అలాటివేం వద్దుగానీ, కాఫీ తాగి ఆ ట్రంకు పెట్టె దించండి."

"ట్రంకు పెట్టా! అదెందుకు? కొంపతీసి అది చదివిస్తావా ఏమిటి?"

"మరే! అదిస్తేగానీ అక్కడికక్కడే మనకు తిరిగి చదివించరు." వాతావరణం తేలిక అయింది. కాఫీ గొంతులోకి జారింది. ట్రంకు పెట్టె కిందికి దిగింది. అందులో కొత్త స్టీలు సామాన్లూ, చాలని జాకెట్టు గుడ్డలూ ఉన్నాయి. అటూ ఇటూ వెతికి ఒక స్టీలు బేసిను తీసింది.

"ఇదుగో ఇది ఎలా ఉంది?"

"స్టీలు బేసినా! బాగుండదేమో? పోనీ ఓ అర్ధ నూటపదహార్లు చదివిస్తే..."

"మిమ్మల్ని అడగడం నాదీ బుద్ధి తక్కువ. ఇంట్లో ఇంత సామానుంచుకుని మళ్ళీ డబ్బులివ్వడం ఎందుకు? బాగుండడానికి అంతేముంది? అయినా, ఆ శ్రీనివాసరావుగారు మనింట్లో గృహప్రవేశానికి ఏం ఘనంగా ఇచ్చాడు! ఓ ప్లాస్టిక్కు డొక్కేగా!"

చిత్రాలు: నర్సిం



"ఏవిటి నాన్నా! ఈ సామాను ముందేసుకుని కూర్చున్నారు?"

"ఆదివారం పెళ్ళికెళ్ళాలి. ప్రెజంటేషను సెలక్ట్ చేస్తున్నాం."

"ఆదివారమేగా! దీన్నీ తీసికెళ్దాం. ఎలాగూ ఆటోలోనే వెళ్తాం కదా!"

"అబ్బే, నేన్రాను. అమ్మా, నాకు విసుగు. నాకెవ్వరూ పరిచయం లేదు."

"ఇదో రోగం నీకు. 'పరిచయం లేదు, పరిచయం లే'దంటూ ఇంట్లో ఆ టీవీని కావలించుకొని కూర్చుంటే ఎలా పరిచయం అవుతుంది? పద్దెనిమిదేళ్ళు నెత్తికొచ్చాయి. కాస్త నలుగుర్లోకీ వస్తే ఫలానివారికి అమ్మాయి ఉందని నలుగురికీ తెలుస్తుంది. నోర్మూసుకుని బయలుదేరు."

"సరే వస్తాను గానీ, త్వరగా వచ్చెయ్యాలి మరి! మధ్యాహ్నం నుండి మంచి ప్రోగ్రాములున్నాయి."

"నీకు ప్రోగ్రాములున్నా, లేకపోయినా భోజనాలు కాగానే బయల్దేరి వచ్చేస్తాం. ఇంకాసేపుంటే వాళ్ళే గెంటేస్తారు."

"ఎవరో పిలుస్తున్నారు నాన్నా."

"ఎవరూ? వీరభద్రరావుగారా! రండిరండి. బహుకాల దర్శనం."

"ఆఁ! ఏం చెప్పమంటారు? పక్కపక్క నందులోనే ఉన్నా కలుసుకోవడం గగనం అయిపోతోంది. ఎలా ఉన్నారు?"

"బాగానే ఉన్నాం. మీరెలా ఉన్నారు? హౌస్ బిల్డింగ్ లోను శాంక్షన్ అయిందా?"

"ఆఁ! నా మొహం. అంత తేలిగ్గా అవుతుందా? తంటాలు పడుతున్నాను. మీకు శ్రీనివాసరావుగారి పిలుపు వచ్చిందా?"

మీనాక్షి గతుక్కుమంది. "ఏవండీ!" కేకేసింది.

"ఆఁ, వస్తున్నా! ఇటు చూడు వీరభద్రరావుగారు వచ్చారు. పిలుపు వచ్చిందిట. ఇవ్వాళే వచ్చారుట."

"వెళ్తున్నారా?"

"వెళ్ళక తప్పుతుందా? ఇంతదూరం వచ్చి పిలిచారు."

"అంతేలెండి. వెళ్ళకపోతే ఏం బాగుంటుంది? మీరు ఎలా వెళ్తున్నారు?"

"ఏవండీ మిమ్మల్నే. ఓసారిలా వస్తారా?"

"ఇదుగో వస్తున్నా. మాట్లాడుతున్నా. ఇంకెలా వెళ్తాం. ఆటోయే గతి."

"అదే ముహూర్తానికి మా ఆఫీసర్ ఇంట్లో పెళ్ళి. నేనటు వెళ్ళాలి. మా ఆవిడను మీతో పంపిస్తాను."

"మా అమ్మాయి కూడా వస్తోంది మాతో. మేమే ముగ్గురం ఉన్నాం."

"భలేవారే. సర్దుకొని వెళ్తే ఆరుగురు వెళ్ళచ్చు. అదీగాక ఖర్చు కూడా కలిసి వస్తుంది. ఎనిమిదింటికల్లా రమ్మంటాను మీ ఇంటికి. వస్తాను మరి." నిశ్చింతగా వెళ్ళిపోయాడు వీరభద్రరావు.

"ఏమిటీ పిల్చావు?" లోపలికి వెళ్ళాడు ఆనందరావు.

"నా తలకాయ. అప్పుడనగా పిలిస్తే ఇప్పుడొచ్చి ఏవిటీ అని అడిగితే ఏం చెప్పను? ఆ వీరభద్రరావు రానూ వచ్చాడు, వీరభద్రమ్మను మనకు అంటగట్టి వెళ్ళనూ వెళ్ళాడు. అయినా నాకు తెలీక అడుగుతాను, ఆటోలో వెళ్తున్నాం అని దండోరా వెయ్యకపోతే ఏం?"


"వెర్రిమొహమా! నేనంత తెలివితక్కువవాడినా?

ఆవిడా వస్తే ఖర్చులో సగం తగ్గుతుంది. ఈ లెక్కన వీరభద్రమ్మే కాదు. ఇంకా లక్ష్మీనారాయణమ్మ వచ్చినా వెంటబెట్టుకు వెళ్ళవచ్చు. కాకపోతే కాస్త ఇరుకవుతుంది."

"హమ్మయ్య. ఆ మాట చెప్పవేం. ఇరుకైతే అయింది సూక్ష్మంలో తేలిపోతాం!"

"ఇరుక్కుని అంతదూరం నేను రానమ్మా. నేను నా ఫ్రెండ్స్‌తో సినిమాకు పోతాను."

"ఇదొహ జబ్బు నీకు! ఏదో ఏడు."



* * *

"కామాక్షీ." నీరసంగా వచ్చాడు శ్రీనివాసరావు.

"వచ్చేరా! ఇదుగో కాసిని మజ్జిగ తాగండి."

"అవును. ఏదో ఈ నాల్రోజులూ ఇలాగే ఉంటేనే మనకు సుఖం. ఎండైతే భరించగలం గానీ వర్షం పడితే అధోగతే. మీ ఆఫీసు వాళ్ళందరికీ శుభలేఖలు ఇచ్చేశారా?"

"ఆ! ఇక పిలుపుల పని పూర్తయినట్లే."

"ఏం పిలుపులో ఏం పాడో. వారం రోజులు పట్టింది. పిలిచేసరికే శక్తి అంతా హరించుకుపోయింది. ఇక పెళ్ళి ఎలా చేసి బయట పడతామో. ఒక పట్టాన తెమిల్తేనా! హనుమంతుడి తోకలాగా లిస్టు తరిగితేనా. అయిదువందల మంది మనవైపు, పెళ్ళివారో వందమంది అనుకొన్నాం. ఇప్పుడు చూస్తే మన వాళ్ళే ఏడొందలు దాటేట్లు ఉన్నారు. ఊర్నిండా బంధువులూ, స్నేహితులు."

"నరే మరి ఏం చేస్తాం? ఎన్నో ఏళ్ళుగా ఇక్కడ పాతుకుపోయినవాళ్ళం. అందరూ తెలిసినవాళ్ళే. ఎవర్ని పిలిచి ఎవర్ని మానుకుంటాం. అయినా, శుభమా అని శుభకార్యం చేస్తూ బాధపడకూడదు. అంతమంది వచ్చి అక్షింతలు జల్లి ఆశీర్వదించి వెళ్తే అదెంత శుభం. ఇంతకీ శంకర్రావు వచ్చాడా?"

మాటలోనే వచ్చాడు శంకర్రావు. "ఏమిటి మహానుభావా, కాయా? పండా?"

"కాయనుకుంటే కాయ. పండనుకుంటే పండు."

"అదేవిటా డొంకతిరుగుడు?"

"ఏం కాదులే. మా అమ్మాయి పెళ్ళినాటికీ ఇప్పటికీ రేట్లు బాగా పెరిగాయిటా. ఆ రేట్లకి చెయ్యలేనన్నాడు. విస్తరికి ముప్ఫై తగ్గడట. బఫే అయితే ప్లేటుకి పాతిక లెక్కన ఇస్తానన్నాడు."

"అది ముందు నుంచీ చెప్తున్న రేటే. నీ రాయబారం పనిచెయ్యలేదన్నమాట." నవ్వేడు శ్రీనివాసరావు.

"అన్నమాటే. ఏం చేద్దాం. పెళ్ళిళ్ళ సీజను. యమ గిరాకీగా ఉంది."

"బఫే పెట్టేద్దామా పోనీ!" కామాక్షి సలహా ఇచ్చింది.

"ఆ మాట నేను ముందరే చెప్పాను. ఎందుకొచ్చిన జంజాటం. వడ్డన అంటే మాటలా? బల్లలూ, కుర్చీలూ, తెల్లకాయితం రీళ్ళకు అదో అదనపు ఆవదం. లక్షణంగా బఫే పెడితే ఎవరి ఇష్టం వచ్చినప్పుడు వాళ్ళు తిని పోతారు."

"ఏవండీ! మనిషికి అయిదు రూపాయలు తగ్గితే ఏడొందల మందిమీద ఎంత కలిసివస్తుంది. ఆ డబ్బుంటే ఏ మేళగాళ్ళకో కలిసిరాదూ!" నచ్చచెప్ప చూసింది కామాక్షి ఆశగా.

"నరే అలాగే కానివ్వండి. అయిదువందల మందికి బఫే, రెండొందల యాభైమందికి వడ్డన అని చెప్దాం." అంగీకరించాడు శ్రీనివాసరావు.

"పద! వెళ్ళి అడ్వాన్స్ ఇచ్చి వద్దాం."

"అలాగే షామియానా వాళ్ళ దగ్గరికి కూడా వెళ్ళిరండి. ఇంకా నీళ్ళ డ్రమ్ము కావాలని చెప్పండి. ఎండాకాలం ఎన్ని మంచినీళ్ళూ చాలవు."

> "రావుగారూ, మా ఆవిడ ఎక్కడైనా కనిపించిందా?" "లేదండీ. నేనూ మా ఆవిడ కోసం వెతుకుతున్నా."

* * *

ఆదివారం 24వ తారీఖు. ఉదయం.

"ఏవిటో ఏడున్నరైనా కాలేదు. అప్పుడే వేడి భరించలేకుండా ఉన్నాం. అంతదూరం వెళ్ళొచ్చేసరికి హూనం అయిపోతాం. వైశాఖంలోగానీ పెళ్ళిళ్ళు పెట్టుకోరు. హాయిగా ఏ మాఘమాసంలోనో అయితే అందరి ప్రాణాలకూ హాయి. ఈ పట్టుచీరతో ప్రాణం పైకెగిరిపోతోంది. వచ్చే పెళ్ళిళ్ళ సీజనుకైనా మంచి గద్వాల చీర కొనుక్కోవాలి." ఆపసోపాలు పడిపోతోంది మీనాక్షి.

"అమ్మాయ్! ఆ ప్రజంటేషన్‌ను ఒక బేగులో వేసి ఇవ్వవే."

"ఇదుగో నాన్నా. నాన్నా మరినాకు సినిమాకు డబ్బులో."

"ఎంతకావాలమ్మా"

"యాభై చాలు."

"ఏం చేస్తున్నారు తండ్రీకూతుళ్ళు! మీరు తయారయ్యారా! ఏదీవిడ? ఒక పట్టాన ఊడిపడదు. నువ్వెళ్ళి చూసిరావే!"

"అదుగో, ఆవిడ వస్తోంది."

"అమ్మయ్య బలికించింది. రండి రండి."

"ఏం వదినగారూ బాగున్నారా! రెడీయేనా!"

"ఆ అరగంట నుంచీ చూస్తున్నాం మీ కోసం. అత్తయ్యగారికి మంచినీళ్ళు ఇవ్వవే. మీరెళ్ళి ఆటో తీసుకురండీ.

"మొత్తానికి శ్రీనివాసరావు తేలిగ్గానే బయటపడ్డాడు."

"ఆఁ! మంచి సంబంధమే. చెప్పులరక్కుండా దొరికింది."

"కట్నం ఎంతట?"

ఏమో మరి! మహా గుట్టు మనుషులు."

"అమ్మా ఆటో వచ్చింది."

"పదండి. తాళాలు జాగర్తగా వేసి సినిమాకెళ్ళు."

ఆటో బయలుదేరింది.

"మీటరు వెయ్యడేం?"

"మీటరు కాదు. వంద రూపాయలు."

"అయ్యో అదేం అన్యాయం?"

"ఆదివారంట."

"అయితే మాత్రం. బొత్తిగా పట్టపగ్గాలు లేకుండా ఉన్నాయి ఆటోవాళ్ళకు."

"ఉష్ ఊరుకో. కోపం వచ్చి, రిపేరు వంకన ఊరి బయట దించేస్తే చచ్చిపోతాం!"

"ఏవిటయ్యా ఇక్కడ ఆపేవు."

"గొంతెండిపోతోంది సారూ. కూల్‌డ్రింక్ తాగొస్తా."

'నాకూ గొంతెండిపోతోంది. మేమిద్దరమే అయితే అదోరకం. వెంట ఈవిడ ఒకర్తె. అందరికీ డ్రింక్‌లంటే అదో పాతిక.' ఆనందరావు స్వగతం.

ఆటో బయలుదేరింది.

"ఇదుగో ఇదే అనుకుంటా!"

"అయ్యో కాదండీ. రేఖా వెడ్స్ సతీష్ అనుంది. శ్రీనివాసరావుగారి కూతురి పేరు శ్రీలక్ష్మి. ఇది కాదు. ముందుకి పోనీ."

"హమ్మయ్య ఇదుగో! మొత్తానికి వేదికి చేరాం!"

* * *

జనం. జనసముద్రం. బాండు హోరు.

"ఏవండీ కాసిని మంచినీళ్ళిప్పిస్తారా?"

"నేనూ పెళ్ళికొచ్చిన వాడినేనండీ!"

"ఓ, సారీ! ఏమనుకోకండి."

"రండి రండి. అక్కడ కుర్చీ ఖాళీగా ఉంది కూర్చోండి."

"థాంక్స్. కాసిని మంచినీళ్ళు ఇప్పిస్తారా?"

"మంచి నీళ్ళా అక్కడ ఎంట్రెన్సు దగ్గర రసనా ఇస్తున్నారు. తీసుకోలేదా!"

"అరే, నేను చూడలేదే."

"వెళ్ళొస్తారా?"

"వెళ్తే మరి సీటు పోతుందేమో."

"నరేలెండి."

* * *

"ఆ పంచె కట్టుకున్నాయనే శ్రీనివాసరావు వియ్యంకుడు."

"ఆహాఁ! కొడుకు పెళ్ళి చేస్తున్నా గుండు పిక్కలా బాగానే ఉన్నాడు."

"ఇంకా రిటైరు అవలేదుట. మంచివాళ్ళు. ఇద్దరు కొడుకులుట. ఈ పెళ్ళికొడుకు పెద్దవాడు."

"రెండో వాడేం చేస్తున్నాడో."

"బి.హెచ్.ఇ.యల్‌లోనో, మిధానీలోనో అన్నారు. గుర్తు లేదు."

"వాళ్ళదే గోత్రం?"

"ఏమోనండీ మరి. శ్రీనివాసరావుని అడగాలి."

"బాబ్బాబు కాస్త సీటు చూస్తూ ఉండండి. అలా వెళ్ళి కన్యాదాతని పలకరించి వస్తాను."

"ఈయన ఆత్రం మండిపోనూ. చూడబోతే ఇప్పుడే మాట్లాడి, ఇక్కడే పెళ్ళి చేసేలా ఉన్నాడే!"

"ఆడపిల్ల తండ్రి కదా! ఆరాటం సహజమే!"

*　　*　　*

"మేళాలు జోరుగా వాయిస్తున్నారు. ముహూర్తమా?"

"కాదనుకుంటాను. కన్యాదానం కావచ్చు."

"మండపం మీద మరీ దడి కట్టేశారు."

"ఇరువైపుల వాళ్ళూ వీడియో తీయిస్తున్నారుట. వాళ్ళకు తోడు స్టిల్ ఫోటోగ్రాఫర్లు. బంధువుల కెమేరాలు. అంతా కలిసి డజనుమందికి పైగా జేరారు. ఇంకేం కనిపిస్తుంది?"

"అదుగో అక్షింతలు పంచుతున్నారు. ముహూర్తం సమీపిస్తున్నదన్నమాట."

"మొత్తానికి శ్రీనివాసరావు గట్టివాడే. సరిగ్గా ముహూర్తానికే బెల్లం, జీలకర్ర పెట్టించాడు. మొన్న ఓ పెళ్ళిలో ముహూర్తం వేళ్ళికి పీటల మీదికి పెళ్ళికూతురు రానేలేదు. బ్యూటీ పార్లర్‌లో ఆలస్యం అయిందిట."

"అక్షింతలు వేసొద్దాం రండి!"

"ఈ తొక్కిడిలో ఎక్కడికి వెళతాంలెద్దురూ. మా ఆవిడ వెళుతుంది లెండి."

"అంతేనంటారా! సరే భోజనానికి పోదాం పదండి. కాసేపు ఆగితే దొమ్మీ ప్రారంభం అవుతుంది."

"ఆమాటా నిజమే. పదండి."

*　　*　　*

"శ్రీనివాసరావుగారూ!"

"ఓ ఆనందరావుగారా! ఇప్పుడా రావడం?"

చాలాసేపైంది వచ్చి. మొత్తానికి పెళ్ళి దర్జాగా చేసేశారు."

"ఆc! ఏదో భగవంతుడి దయ. మీ అందరి సహకారం. భోజనం చేశారా?"

"చేశాం."

*　　*　　*

"ప్రసాదరావుగారూ, మా ఆవిడెక్కడైనా కనిపించిందా!"

"లేదానందరావుగారూ. నేనూ మా ఆవిడ కోసం వెతుకుతున్నా."

"అబ్బ ఎక్కడికి పోయారండీ. వెతకలేక వినుగొచ్చింది"

"ఏడిసినట్లుంది. నేను నీ కోసం వెతుకుతున్నాను. అన్నం తిన్నావా? వెళ్దామా?"

"ఆc, వెళ్దాం. ఈవిడెక్కడుందో. ఇదో తలనొప్పి."

"సరే. నువ్వు ఆవిడని వెతుకు. నేను ఆటో తీసుకొస్తా."

*　　*　　*

"హమ్మయ్య, ఆటో దొరికింది. ఈ ఎండలో ఇంకాసేపు నిలబడితే కళ్ళు తిరిగేవే."

"దొరికింది. కాకపోతే పన్నెండాఫ్."

"పన్నెండాఫా? పట్టపగలు పన్నెండాఫ్ ఏమిటండీ?"

"ఎండ ఎక్కువగా ఉందికదా. అందుకు."

"అయితే మటుకు. ఈ ఆటోవాళ్ళ ఆగడం మరీ ఎక్కువైపోతోంది."

"ఉష్ ఊరుకో. రానని మొండికేసుకుని కూర్చుంటే కాళ్ళావేళ్ళా పడి ఒప్పించాను."

"దేవుడా ఇదేం ఎండ బాబోయ్. గాడిపొయ్యి దగ్గర కూర్చునట్లుంది. ఏవిటో బ్రహ్మాండంగా పిలుస్తారు. వెళ్తాం. తీరా చూస్తే ఒక ఆదరింపూ ఉండదు. పలకరింపూ ఉండదు."

"ఇంకానయం పదినగారూ, ఈ పెళ్ళిలో భోజనమైనా బాగుంది. కొంతమంది తిండి కూడా తిన్నగా పెట్టరు."

"అదీ నిజమేలెండి. కేటరింగ్‌వాడు బాగానే చేశాడు. ముఖ్యంగా కొత్తావకాయ. జిహ్వ లేచి వచ్చింది."

"కొత్తావకాయా? అదెక్కడుంది?" ఆనందరావుకి అప్పుడు నోరూరింది.

"అదేవిటి? గోంగూర పచ్చడి పక్కనే లేదూ?"



"గోంగూర పచ్చడా? అదెక్కడుంది?" నిలువునా నీరయిపోయాడు.

"హరి భగవంతుడా. ఏది చూసినా ఎక్కడుంది ఎక్కడుంది అంటారు. అసలు మీరేం తిన్నారు?"

"ఏం తింటాను? ఒకటే తొక్కిడి, తోపులాటా. రెండు పూరీలు వేసుకునేసరికి తోశారు. బజ్జీల ప్లేటు దగ్గరికి చేరాను. అవి రెండు వేసుకుంటూ ఉండగానే మళ్ళీ తోశారు. మంచినీళ్ళ దగ్గిరికి వచ్చేశాను."

"ఆడవాళ్ళ దగ్గర కూడా తొక్కిడిగానే ఉంది. అయినా, కాపీనం కాకపోతే ఇంతమందిని పిల్చినప్పుడు మరో రెండు టేబుల్స్ వేసుకోరూ! అయిస్ క్రీమూ అలాగే ఏడిసింది. డీప్ ఫ్రీజరుకి ఏదో రిపేరుట.

> "కొత్తావకాయా? అదెక్కడుంది?" ఆనందరావుకి అప్పుడు నోరూరింది. "అదేవిటి? గోంగూర పచ్చడి పక్కనే లేదూ?"

కరిగిపోయి చీరంతా పడింది. డ్రైక్లీనింగ్‌కు ఇవ్వాలి."

"అయిస్ క్రీము కూడా పెట్టారా?"

"అయితే అదీ తినలేదా! ఈయనతో ఇదో గొడవ పదినగారూ! ఎక్కడికి వెళ్ళినా ఇంతే. ఏదో కాస్త నంజి రానూ. ఇంటికెళ్ళగానే అన్నం ఉందా? అట్లపిండి ఉందా? అంటూ నా ప్రాణం తియ్యనూ..."

"మా ఆయనా అంతే పదినగారూ! ఆ మాటకొస్తే ఈ మగవాళ్ళంతా అంతేనేమో!"

"అందరూ ఇట్లా ఎందుకుంటారు? మాధవరావని మా అన్నయ్య వరస మలక్‌పేటలో ఉంటాడు. ఎక్కడికి వెళ్ళినా అన్ని పదార్థాలూ మారు వడ్డించుకుని మరీ తింటాడు."

"మీ మాధవరావన్నయ్య సంగతే చెప్పు. కండబలంతో అభిమన్యుడిలా చొచ్చుకుపోతాడు. అందరికీ అంత తెగువ ఉండొద్దూ."

"అరే, మాటల్లో వచ్చేశామే. మిమ్మల్ని దిగబెట్టి మేం వెళ్తాం పదినగారూ. మీరొచ్చారు చాలా సరదాగా ఉంది." "ఇక్కడే ఆపవయ్యా."

"నిజమే పదినగారూ. నాకూ చాలా బాగుంది. థ్యాంక్స్ అన్నయ్యగారూ. మీ పుణ్యమా అని సుఖంగా వెళ్ళొచ్చాం. వెళ్ళొస్తా మరి!"

"హయ్యో హయ్యో, ఇదేవిటండీ. డబ్బులివ్వకుండా పోతుందేం?"

"ఏమో మరి."

"ఏమో మరి ఏవిటీ. అలాగే అనుకున్నారుగా."

"ఆయన కచ్చితంగా చెప్పాడు. ఆవిడకి తెలియదేమో!"

"అంత తెలియకుండా ఉంటుందా. ఏం ఇద్దరూ ఒకింట్లో ఉండడం లేదా!"

"కిధర్ జానా సాబ్!"

"వల్లకాట్లోకి. తిన్నగా తీసికెళ్ళు. ఇక్కడాపు."

"హమ్మయ్య. ఎంతయిందండీ?"

"నూట ఏడు."

"ఓరి దేవుడా. దీని అఘాయిత్యం కూలిపోనూ. ఆటోలో టింగు రంగామని వచ్చి థాంక్సు చెప్పి గుండ్రాయిలా దొర్లుకుంటూ పోయింది. సగం ఆటో ఆవిడకే సరిపోయింది. ఇరుక్కుని చచ్చాం. అయినా, వాళ్ళని అని ఏం లాభం? ఆయన పెళ్ళాన్ని పంపిస్తానని చెప్పినప్పుడే మీరు స్పష్టంగా చెప్పి ఉండాల్సింది."

"చాల్లే ఊరుకో. ప్రతీదానికీ నేనొకడిని దొరుకుతాను సాధించడానికి. వాళ్ళని చూసి నేర్చుకోండి, వీళ్ళని చూసి నేర్చుకోండి అంటూ నన్ను పీక్కుతింటావు. ఆవిడని చూసి నువ్వూ నేర్చుకో. నామీద ధాష్టీకం చలాయించే బదులు ఆవిడ వెళ్ళిపోతుంటే దొరకపుచ్చుకుని డబ్బులడగకపోయావా?"

రక్కున నోరు మూసేసుకుంది మీనాక్షి. ఇంట్లోకి వెళ్ళి చల్లటి నీళ్ళు తాగి ఫేనువేసుకొని పడుకున్నాడు ఆనందరావు. కడుపులో ఆకలి. ఎండకి శోష. "ఈ నెలలో ఇప్పటికి ఇది ఆరో శుభకార్యం. వెళ్ళిన ప్రతిసారీ సగటున నూటయాభై చొప్పున ఖర్చు. వెయ్యిపైగా అయింది ఈ నెల్లో. ఇక ఈ పెళ్ళిళ్ళకు వెళ్ళే పద్ధతి మానేద్దాం. మనవల్ల కాదు. ఫోన్ చేసి రాలేమని చెప్పేద్దాం."

"ఎప్పటికప్పుడు ఇలా అనుకుంటూనే ఉన్నాం, వెళ్తూనే ఉన్నాం."

"ప్చ్, ఏవిటో!"

*　　　*　　　*

ఉస్సురంటూ కూలబడ్డాడు శ్రీనివాసరావు.

"సెటిల్ చేశారా?"

"ఆఁ అయింది. తల ప్రాణం తోకకి వచ్చింది. ఆరువందల ప్లేట్లు, రెండొందల డెబ్బై అయిదు విస్తళ్ళకీ లెక్క గట్టి ఇచ్చాను. వాడి లెక్క ప్రకారం ఇంకా ఎక్కువ పడింది."

"ఇదెక్కడి అన్యాయం. పిలిచినదానికంటే ఎక్కువమంది అవుతారా ఎక్కడైనా?"

"ఏమో మరి. ప్లేట్ల లెక్క, ఆకుల లెక్క మనవాళ్ళే చూసుకున్నారు. బయట వాళ్ళు కూడా వచ్చారేమో! ఆ హడావిడిలో ఎవరు ఎవరో ఎలా తెలుస్తుంది?"

"అదీ నిజమే. అక్కడ ఏమైనా అంటే గొడవ అయిపోదూ. ఎవరికైనా కోపాలొస్తే."

"అవును. ఎత్తెత్తి కాలు ఎంగిలాకులో వేసినట్లు. పోయిపోయి ఏ పెళ్ళికొడుకు స్నేహితుడినో పట్టుకుంటే అభాసు అయిపోతుంది. పోన్లే. ఏదో పెళ్ళి చేసేశాం. మంచి ఇంట్లో అమ్మాయిని పడేశాం. జన్మ ధన్యం. వియ్యాలవారు చాలా మంచివాళ్ళు. ఒకమాట అన్లేదు."

"ఆలోపం లేకుండా మనవాళ్ళు మాటలన్నారుగా. ఒకటే నీలుగులు, ఒకటే అలకలు. పనిచెప్తే చెప్పారని కోపం. చెప్పకపోతే పెత్తనం మాకివ్వకుండా అంతా మీరే చేసుకున్నారని రభస. వీళ్ళ గొడవలతో తలకాయ పట్టిపోయింది."

"మరి ఏమనుకున్నావు. సమయం కనిపెట్టి నీలిగితే కదా వాళ్ళ గొప్పతనం తెలిసేది. శుభకార్యం చేస్తున్నవాళ్ళం మనం. అవసరం మనది. మనమే సర్దుకుపోవాలి. వసుదేవుడంతటివాడికే తప్పలేదు. మనమో లెక్కా?"

"చుట్టాలకే కాదు, పెళ్ళికొచ్చినవాళ్ళకీ కోపాలొచ్చాయిట. పలకరించి, ఆదరించి మర్యాద చెయ్యలేదని అన్నారుట. ఎట్లా పలకరిస్తాను? మనం పీటలమీద కూర్చునేసరికి వాళ్ళెవరూ రాలేదు. పెళ్ళి మధ్యలో కన్యాదానం ఆపేసి, కలశం చెంబు పక్కన పెట్టివచ్చి పలకరించలేనుకదా. తలంబ్రాలు అయి కిందికి వచ్చేసరికి భజంత్రీలవాళ్ళు తప్పించి పిట్ట పురుగు లేదు. ఇంక ఎప్పుడు పలకరిస్తాను, ఎప్పుడు ఆదరిస్తాను?"

"ఇవన్నీ సహజమే. రేపు వాళ్ళింట్లో పెళ్ళికి వెళ్ళి మనమూ ఇలాగే అందాం. సరిపోతుంది. అదిసరే, ప్రెజంటేషన్లన్నీ విప్పుతున్నావేం? అలాగే ఉంచి అమ్మాయికి ఇచ్చెయ్."

"అమ్మాయికే ఇస్తాం. కానీ, ఎవరు ఏమిచ్చారో గుర్తుపెట్టుకుని బాకీ తీర్చద్దూ."

"అవును కదూ. ఉండు నేనూ సాయం చేస్తాను."

"బండెడు స్టీలు సామాను వచ్చింది. ఇవన్నీ అదిమాత్రం ఏం చేసుకుంటుందీ. పేర్లు వెయ్యని సామాన్లేవైనా ఉంటే పక్కన పెట్టండి. ఉత్తరోత్తరా ఉపయోగపడతాయి."

"అలాగే."

"ఇంకా ఎన్ని ఉన్నాయి?"

"అయిపోయింది. ఇదే ఆఖరు. రాసుకో. ఆనందరావు గారు ఒక స్టీలు బేసిను. ఇది నాకు ఇవ్వరాదుటోయ్."

"మీకా? ఎందుకూ? మీరేం చేసుకుంటారు?"

"అనుకున్నదానికన్నా పదివేలు ఎక్కువ అయింది. రేపటినుండి వేట మొదలుపెట్టాలి. ఈ బేసిను అనువుగా ఉంది." ఏడవలేక నవ్వేడు శ్రీనివాసరావు.

కళ్ళనీళ్ళు తిరిగాయి కామాక్షికి. "ఎళ్ళతరబడి చీమల్లా కూడబెడితే ఒక మూలకి రాలేదు. ఇంత హడావిడి, ఆర్భాటం బదులు ఏ గుళ్ళోనో క్లుప్తంగా పెళ్ళిచేసి ఈ డబ్బంతా దంపతుల చేతుల్లో పెడితే ఎంత బాగుండేది."

"బాగుండకేం. దివ్యంగా ఉంటుంది. కానీ, అట్లా చెయ్యలేం కదా! నలుగురితో పాటు నారాయణ. ప్చ్, ఏవిటో!" ■



# హృద్యమైన అభ్యుదయ గీతం

## అస్తిత్వ పరివేదనలోంచి జనించిన అభ్యుదయ కవితాప్రవాహం



**శివధనువు (కవితాసంపుటి)**
రచన: రెంటాల గోపాలకృష్ణ
ప్రతులకు: 1. రెంటాల స్మరణోత్సవ సంఘం, పురుషోత్తం వీధి, ఎస్సెన్ పురం, విజయవాడ - 11; 2. విశాలాంధ్ర, ప్రజాశక్తి బుక్ హౌస్ శాఖలన్నీ.
పేజీలు:164; వెల:రూ.80.

పనునూరు శ్రీధర్‌బాబు

తెలుగు కవిత్వం సామాజిక అభ్యుదయాన్ని పునాదిగా చేసుకుని భూమార్గం పట్టిన చారిత్రక సందర్భంలో కవిగా రూపుదిద్దుకున్న వ్యక్తి రెంటాల గోపాలకృష్ణ. వచన కవిత్వాన్ని జనసామాన్యానికి చేరువ చేయాలని ఉద్యమించిన కుందుర్తి, గాఢమైన అనుభూతుల్ని కవిత్వంగా శిల్పించిన దేవరకొండ బాలగంగాధర తిలక్, అగ్నివీణ పలికించిన అనిసెట్టి సుబ్బారావు తదితరులతో కలసి 1940లలో నరసరావుపేటలో కళకళలాడిన నవ్యకళాపరిషత్తును వేదికగా చేసుకొని రెంటాల గోపాలకృష్ణ గళం విప్పారు. అప్పటికే, తెలుగు కవిత్వం వ్యక్తి స్పృహ నుంచి సామాజిక స్పృహలోకి అడుగు పెట్టింది. వస్తుపరంగా, రూపపరంగా ఎన్నో మార్పులకు గురైంది. ఆ కవిత్వ పరిణామక్రమానికి బాధ్యులైన కవి ప్రముఖులలో రెంటాల ఒకరు. నవ్యకళాపరిషత్తు నుంచి 'నయాగరా' మీదుగా, అభ్యుదయ రచయితల సంఘ సభ్యునిగా ఆయన సాగించిన ప్రస్థానం తెలుగు సాహిత్య చరిత్రలో చిరస్మరణీయం.

> "నడుస్తున్న శవం ఒకటి/ నభః పథము చూస్తున్నది,/ జ్వలిస్తున్న కాంక్ష ఒకటి/ జగత్తును దహిస్తున్నది!"

1950లో *సంఘర్షణ*, 1957లో *సర్పయాగం* కవితా సంకలనాలను ప్రచురించి సమకాలికుల మెప్పు పొందిన రెంటాల గోపాలకృష్ణ, జీవిత చరమాంకం దాకా అక్షరాన్నే నమ్ముకుని దాదాపు అన్ని సాహిత్య రూపాలలో తన ప్రజ్ఞాపాటవాల్ని చాటుకున్నారు. ఆయన కవిత్వేతర రచనలు చాలా వరకు అచ్చయ్యాయి. కానీ, *సర్పయాగం* తరువాత రాసిన కవిత్వం మాత్రం ఇంతదాకా వెలుగు చూడలేదు. రెంటాల తీరని కలగా మిగిలిన ఈ శివధనువు ప్రచురణ బాధ్యతను ఆయన వారసులు స్వీకరించి తెలుగు పాఠకలోకానికి సమర్పించారు.

రెంటాల రాసిన "ఆకలి పాటలు" (1952), *నగరంలో రాత్రి* తదితర కవితలు, ఎలిజీలు, మరికొన్ని అనువాద కవితలతో ఈ శివధనువు రూపుదిద్దుకుంది. శ్రీరంగం నారాయణబాబు చెప్పినట్లు, "అతినవ్య కవులలో మూడోతరానికి చెందిన" రెంటాల సృజించిన ఈ శివధనువు కావ్యం ఆయన దృక్పథాన్ని స్పష్టం చేస్తుంది. ఈ సంకలనంలో ఆయన, బూర్జువా వ్యవస్థలోని అవలక్షణాలను నిరసించే అభ్యుదయ వాదిగానే కాకుండా తన అస్తిత్వాన్ని శోధించుకునే అంతర్ముఖునిగా కూడా దర్శనమిస్తారు.

*కాదు సుమా రాజహింస/ జీవితం ఒక చిత్రహింస*

అంటూ మానవ జీవన వేదనను ఆలపించిన రెంటాల తన శివధనువులో సంఘానికీ, మనిషికీ మధ్య సాగే సంఘర్షణను, అలవికాని జీవన కాంక్షను అక్షరబద్ధం చేశారు. సంఘంలోని డొల్లతనాన్ని బట్టబయలు చేస్తూ ఆయన,

*"నిప్పును కన్నెత్తి చూడలేదు సంఘం*
*నిజాన్ని సూటిగా వినలేదు సంఘం*
*నిజాన్ని చంపి నిజాన్ని పూజిస్తుంది సంఘం*
*న్యాయాన్ని హత్యచేసి న్యాయాన్ని గౌరవిస్తుంది సంఘం"* అంటారు. ఇలాంటి వ్యవస్థలో సొంత వ్యక్తిత్వంతో జీవించాలనుకున్న మనిషికి పోరాటం తప్పదు. అంతః ప్రపంచాన్నీ బాహ్య ప్రపంచాన్నీ కుదిపేసే ఈ పోరాటం సామాన్యమైనది కాదు. అందుకే కవి,

*ఎన్ని కడవల కన్నీటిలో తడవను*
*ఎన్ని తడవలు మృత్యువుతో నడవను?*
*ఎన్నేళ్ళు ఈ జననశిక్ష*
*ఎన్నాళ్ళు ఈ మరణశిక్ష?* అని పరితపిస్తాడు.

ఆరుద్ర చెప్పినట్లు శిష్ట్లా విష్ణుధనువు ప్రేరణతో రెంటాల శివధనువు రచించినప్పటికీ, కవితా నిర్మాణంలో రెండింటికీ సామ్యమేమీ లేదు. శ్రీశ్రీ సంస్కృత భాషాడంబరాన్ని తిరస్కరించిన *నయాగరా* కవుల వెంట ఉన్న రెంటాల గోపాలకృష్ణ స్పష్టమైన ఆధునిక వచన కవితా శిల్పాన్ని తన పరం చేసుకున్నారు. అపార పాండిత్యాన్ని సొంతం చేసుకున్నా ప్రకర్షకు దిగకుండా, ప్రలోభాలకు లోనుకాకుండా ఆయన అచ్చమైన వచన కవిత్వాన్ని నుడివారు.

నగర జీవితంపై రెంటాల రాసిన అసంపూర్ణ దీర్ఘ కవిత *నగరంలో రాత్రి* వస్తురీత్యా, శిల్పరీత్యా అచ్చమైన ఆధునిక కవిత. నగర జీవితంలోని యాంత్రికతనూ, ప్రేమ రాహిత్యాన్నీ నగ్నంగా చిత్రించిన ఈ కవిత పాఠకునిలో తీవ్రమైన సంక్షోభాన్ని సృష్టిస్తుంది.

*రాత్రి నన్ను రమ్మని పిలిచింది*
*రాత్రి నన్ను సొమ్ముకు వలచింది!...*
*వేయి కౌగిళ్ళలో నలిగి నలిగి*
*ఒరిగి ఒదిగి పడుకున్న*
*వేశ్య వాలుజడ నగరవీధి...*
*రాత్రి నవనీతంలా ఉంది*
*రాత్రి శివగీతంలా ఉంది!...* అంటూ సాగే ఈ కవిత *ప్రతి ఇంట్లో ఒక నేరం / ప్రతి కంట్లో ఒక భారం* అని ముగుస్తుంది. ఈ ప్రపంచం ఇట్లా ఉందేమిటి? పరిపూర్ణమైన ప్రేమను బతికించాల్సిన మనుషులు అంతరాత్మల్ని చంపుకుంటున్నారేమిటనే వేదనలోంచి పుట్టుకొచ్చినవే రెంటాల అక్షరాలు. ఆ వేదనతోనే ఆయన ఆజన్మాంతం దహించుకుపోయారు. ఆ బాధ నుంచి ఉపశమనం పొందడానికి ఆయన మళ్ళీ అక్షరాలనే ఆశ్రయించారు. నిశ్శబ్దం అనే ఖండికలో ఆయన తన చిరంతన వేదనను వినిపిస్తారిలా:

*కష్టాల్ని వత్తిగా చేసి మరో దీపం వెలిగిస్తున్నాను*
*దీపం కాని దీపం, పాపం, మరణ దీపం*
*దుఃఖాన్ని చమురుగా పోశాను*
*తలక్రింద దీపం పెట్టుకున్నాను...* ■